క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

పెడన: పట్టణంలోని పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఇందిరా కాలనీలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని పెడన క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి, క్రైస్ట్ ఆఫ్ చర్చి నిర్వాహకులు కె.చంద్రమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రికి చెందిన వైద్యులచే ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. సాధారణ వైద్యంతో పాటు స్త్రీలు (గైనిక్), కంటి, చెవి, ముక్కు, గొంతు, జనరల్ సర్జరీ, చర్మవ్యాధుల నిపుణులు పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఉచితంగా మందులను కూడా అందిస్తామన్నారు. పెడన పరిసర ప్రాంత ప్రజలు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నిక

పెడన: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పెడన మండల యూనిట్ నూతన అధ్యక్షుడుగా మట్టా రాధాకృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానికంగా సంఘ జిల్లా నాయకులు రాజేంద్రప్రసాద్, ఆశీర్వాదం, ఎ.శంకరరావు సమక్షంలో పెడన మండల యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా మట్టా రాధాకృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ఫణిభూషణరావు, కార్యదర్శిగా వైకేఎస్ మల్లయ్య, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ హమీద్, ఎంఏ ఆలీం, వి.త్రిపుర సుందరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా బి. జ్యోతికమలకుమారి, వీరభద్రస్వామి, అబ్దుల్‌రజాక్, వి. రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'సిలువ మార్గం' నిర్వహణ



బందలాయిచెరువు (అవనిగడ్డ): మండల పరిధిలోని బందలాయిచెరువులో ఆర్‌సీఎం సంఘం ఆధ్వర్యంలో సోమవారం సిలువ మార్గం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన 14 స్థలాల్లో సిలువను ఉంచి పరలోక ప్రార్థన, గీతాలు ఆలపించారు. ఫాదర్ సురేష్ మెర్లో ప్రత్యేక ప్రార్థన చేశారు. తపస్సుకాల దీక్ష తీసుకున్నవారు సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. దీక్షా సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు దానాలు చేయాలన్నారు. ఆపదలో ఉన్నవారికి సహాయ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపలువురు ఉపదేశీలు, స్థానిక సంఘ పెద్దలు గొర్రుముచ్చు కోటేశ్వరరావు, పరిశుద్ధరావు, రవి, దాసు, ఆరిగ లంకేశ్వరరావు, పలు గ్రామాల నుంచి వచ్చిన దీక్షా దారులు, సంఘస్తులు పాల్గొన్నారు.


వెంకన్న ఆదాయం రూ.98 వేలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని గొడుగుపేటలో వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. మూడు నెలల 28 రోజులకు గానూ హుండీలలో రూ.98,325 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.వేణుగోపాలరావు పాల్గొన్నారు. సుల్తానగరంలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 42,645 ఆదాయం వచ్చినట్లు శ్రీనివాసరావు వివరించారు. నెల 13 రోజులకు గానూ ఈ ఆదాయం సమకూరిందని ఆయన చెప్పారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

చిట్టి పిళ్లారయ్యకు పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేటలో వల్లభాంబ సమేత మహాగణపతి పంచాయతన క్షేత్రంలో శ్రీ చతచండీ సహిత శ్రీ మహారుద్ర యాగం అష్టమ వైభవోత్సవాలు రెండో రోజైన ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ గణపతి పూజ, మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకములు, శ్రీ మహారుద్ర యాగం, శ్రీ శతచండీ యాగం ప్రారంభించారు. రుత్విగ్వరణము, దీక్షాధారణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అగ్నిమందన, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమం చేశారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ భక్తబృందం పర్యవేక్షించింది.

'అగ్ని'బాధిత కుటుంబానికి సాయం



కృత్తివెన్ను: అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన కాటూరి రాంబాబు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులకు రూ.6 వేలు అందించారు. ప్రమాద ఘటనపై రాష్ట్ర మంత్రి జోగి రమేష్‌కు తెలియజేశామని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, సాయికుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.



ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కమ్మిన మంచు

వీడని మంచు..

గతంలో ఎన్నడూ లేనివిధంగా దిబిసీమను మంచు దుప్పటి కప్పేసింది. కళ్లకు మంచుగంతలు కట్టేసింది. ఉదయం పది గంటలు దాటినా మంచు వీడకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు పనులకు వెళ్లే మినుము కాయ కోత కూలీలు 9.30 గంటల తరువాత పొలం వెళ్లాల్సి వచ్చింది. ఊటీని తలపించేలా మంచు పట్టడంతో ప్రకృతి ప్రేమికులు పరవశించి పోయారు. పగలు ఎండ తీవ్రత..రాత్రి చలి తీవ్రత..ప్రజలు భిన్న పరిస్థితులను చవిచూస్తున్నారు. అకాల శీతలమని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. –అవనిగడ్డ



ఉదయం 8.45కి బందలాయిచెరువు వద్ద అవనిగడ్డ ప్రధాన రహదారిపై..



ఉదయం 9.05కి అవనిగడ్డ వంతెన సెంటర్‌లో..



మంచు దుప్పటిలో అవనిగడ్డ గాలిగోపురం

గడప గడప నిధులతో కాలనీల అభివృద్ధి

- పేర్ని కిట్టు
- 34,49 డివిజన్లు, తుమ్మలచెరువులో గడప గడపకు మన ప్రభుత్వం
- పంచాయతీ చెరువు పనులకు రూ.10 లక్షలు



డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పేదలు నివసించే పలు కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 34,49 డివిజన్లలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించనున్న డ్రెయిన్ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగిన డివిజన్లకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. ఆయా డివిజన్ ప్రజలు అడిగిన సమస్యల పరిష్కారానికి ఈ నిధులను వెచ్చిస్తున్నామన్నారు. పలు డివిజన్లలో ఈ నిధులతో సిమెంటు రోడ్లు, పక్కా డ్రెయిన్లు వంటి పనులు నిర్వహించామన్నారు. డివిజన్‌లోని అన్వర్ ఇంటి నుంచి 80 మీటర్ల డ్రెయిన్ నిర్మాణ పనులను రూ.1.71 లక్షలు, పూర్ణచంద్రరావు ఇంటి నుంచి 92 మీటర్ల డ్రెయిన్‌ను రూ.1.45 లక్షలతో నిర్మాణం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆ డివిజన్ ఇన్‌చార్జ్ బడే భానుతేజ మాట్లాడుతూ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూ.2 కోట్లతో తమ డివిజన్‌లోనే ఏర్పాటు చేశారని, రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని ల హయాంలో పనిచేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గోని, కార్పొరేటర్లు మీర్‌అస్గర్‌అలీ, మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, డివిజన్ కన్వీనర్ సుంకర రాఘవరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, పురంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. 49వ డివిజన్‌లో పేర్ని కిట్టు వెంట ఆ డివిజన్ కార్పొరేటర్ పల్లి శేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మరీదు నాగరాజు పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: మండల పరిధిలోని తుమ్మలచెరువు పంచాయితీ చెరువు అభివృద్ధి పనులకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు పాల్గొన్నారు. గ్రామంలో మహిళలు పంచాయితీ చెరువుకు చుట్టూ పెన్సింగ్ వేయించి, చెరువు చుట్టూ గట్టు వేయించాలని కోరారు. స్పందించిన కిట్టు విషయాన్ని బందరు ఎమ్మెల్యే పేర్ని నాని దృష్టికి తీసుకువెళ్లగా విషయం తెలుసుకున్న పేర్ని నిధులు మంజూరు చేశారు. గ్రామ ఇన్‌చార్జ్‌లు తలారి శ్రీనివాసరావు, తలుపుల లక్ష్మణ, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మగడ్డలంకలో మట్టి తవ్వకాలు ఆపాలి

తహసీల్దార్‌కు మొర పెట్టుకున్న లంక రైతులు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రైతులు

చల్లపల్లి: నిమ్మగడ్డలంకలో మట్టి, బుసక, ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఎస్సీ రైతులు విన్నవించారు. సోమవారం 'స్పందన' సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి నిమ్మగడ్డ ఎస్సీ రైతులు చేరుకుని తహసీల్దార్ కే గోపాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. 1983లో ప్రభుత్వం 300 ఎకరాల నిమ్మగడ్డలంక భూమిని 700 మంది నిరుపేద ఎస్సీలకు కేటాయించారన్నారు. నాటి నుంచి తాము సొసైటీగా ఏర్పడి సాగు చేసుకుంటున్న లంక పక్కనే కేఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్–పామర్రు నిర్వాహకులు కొద్ది రోజులుగా మట్టి, బుసక జేసీబీలు, భారీ టిప్పర్లు పెట్టి తవ్వుకుపోతున్నారని తెలిపారు. ఈ తవ్వకాలు కొనసాగితే సముద్రపు నీరు చొచ్చుకుని వచ్చి లంక పూర్తిగా సాగుకు పనికి రాకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సముద్రపునీరు రాకుండా రూ.లక్ష చందాలు వేసుకుని అడ్డుకట్ట ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఇటీవల వరదలకు అడ్డుకట్ట తెగిపోయిందన్నారు. ఇప్పుడు తవ్వకాలు చేస్తే సముద్రపు నీరు వేగంగా చొచ్చుకువచ్చి లంక భూములు సాగుకు పనికి రాకుండా పోతాయని తెలిపారు. పశువులకు సైతం తాగునీరు, గ్రాసం లభించే పరిస్థితి ఉండదన్నారు. గ్రామస్తుల అభ్యంతరాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

తహసీల్దార్ ఆదేశాలతో ధాన్యం కొనుగోలు



రైతుల సమస్యపై ఫోనులో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

చల్లపల్లి: 'స్పందన' ఫిర్యాదుపై తహసీల్దార్ కే.గోపాలకృష్ణ సత్వరమే స్పందించి వెంటనే పరిష్కరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి లక్ష్మీపురం నుంచి కనకమేడల వాసు ఆధ్వర్యంలో రైతులు వచ్చి తమ సమస్య వివరించారు. తడిచి, రంగు మారిన ధాన్యం, ఇంకా నూర్పి సిద్ధంగా ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని విన్నవించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి తగు సూచనలు చేశారు. తాజా కొనుగోలు ప్రక్రియ కోసం కేటాయించిన రైస్ మిల్లర్లతో, పీఏసీఎస్ కార్యదర్శులతో, రైతుభరోసా కేంద్రం సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. నూర్పి సిద్ధంగా ఉన్న రైతులకు గోనె సంచులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రస్తుతం నూర్పి ఉన్న ధాన్యం వెంటనే విక్రయించుకోవాలని, మిగిలిన వరి కుప్పలు వర్షాల తర్వాత నూర్చుకోవాలని సూచించారు. ఇప్పటికే విక్రయించిన ధాన్యం తాలూకా సొమ్ము తమ ఖాతాలకు జమ అయినప్పటికీ, ఇంకా హమాలీ చార్జీలు, రవాణా చార్జీలు రాలేదని రైతులు ప్రస్తావించగా, ఆ సమస్య కూడా త్వరలో పరిష్కారం చేస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ హామీ ఇచ్చారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

గుడివాడటౌన్: పురపాలక సంఘ పరిధిలో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ తెలిపారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో సోమవారం పారిశుద్ధ్య, ఆరోగ్య, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో దోమలు నివారించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి వెళ్లి జ్వరం పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అంటువ్యాధులు సోకకుండాఅవగాహన కల్పించాలన్నారు. జ్వరాలు తదితర పరీక్షలు నిర్వహించిన వివరాలను వారి లాగిన్‌లలో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాపై తనిఖీలు పెంచాలని క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఇంజినీర్, డీఈఈ,అసిస్టెంట్ కమిషనర్, శాని టరీఇన్‌స్పెక్టర్‌లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



గూడూరు: వేసవిలో పచ్చిరొట్టగా నవధాన్యాల సాగుతో నేల తల్లికి ఎంతో మేలు జరుగుతుందని కలపటం సర్పంచి ఐనాల దేవనాగ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కలపటంలో ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. రబీలో పంట కోసిన తర్వాత ఖాళీగా ఉన్న భూముల్లో నవధాన్యాలు చెల్లడం ద్వారా నేల సారవంతమై జీవ వైవిధ్య సేంద్రీయ కర్బనం పెరుగుతుందన్నారు. తద్వారా పంటలకు అవసరమైన అన్నిరకాల పోషకాలు భూమికి అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ జె.సోమేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



కోడూరు: వేసవికాలం ఆరంభం కావడంతో కోడూరు జెడ్పీ పాఠశాలలో చదివే విద్యార్థులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో చదివే 300 మంది విద్యార్థులకు దాతల సహకారంతో వేసవి పూర్తి అయ్యే వరకు ఈ మజ్జిగ పంపిణీని కొనసాగించనున్నట్లు ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం తెలిపారు. తొలిరోజు సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్ దంపతులు ఆర్థిక సహాయంతో మజ్జిగను అందించారు. విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ఉపాధ్యాయులను సర్పంచి అభినందించారు. పీఎంసీ కమిటీ చైర్మన్ దావు మల్లి, విద్యాకోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విదేశీవిద్యతో ఉన్నత శిఖరాలు

గుడివాడటౌన్ :డిగ్రీ పూర్తిచేశాక విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఆపై చదువులు అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని చికాగో యూనివర్సిటీ ప్రొఫెసర్ పొట్లూరి దేవీప్రసాద్ తెలిపారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో సోమవారం విదేశీవిద్య ఉపాధి అవకాశాలు అనే అంశంపై పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విదేశాల్లో విద్యనభ్యసించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. వాటిని వినియోగించుకుని విదేశాల్లో పరిశోధనా కోర్సులు పూర్తి చేస్తే తిరిగి భారతదేశంలోనే సేవలందించవచ్చన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎం.శివనాథ్, విశ్రాంత ప్రిన్సిపల్ ఎస్.శంకర్, ఎంబీఏ విభాగాధిపతి సి.లక్ష్మీనాథ్, నాగేంద్రకుమార్, పద్మజ పాల్గొన్నారు.

డిస్కస్‌త్రోలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



స్వర్ణబహుమతిని అందుకున్న బోనిక

పెడన: మండలంలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా ప్రథమ సంవత్సరం చదువుతున్న సివిల్ విద్యార్థిని యార్లగడ్డ బోనిక డిస్కస్‌త్రోలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన ఐపీఎస్‌జీఎం–2023 సౌత్‌జోన్ (ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ) పోటీల్లో డిస్కస్ త్రో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణపతకం సాధించిందని తెలిపారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బోనికను, కోచ్ రమేష్‌లను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కుమార్‌బాబా, డైరెక్టర్లు సాయి, దోసపాటి బాబా తదితరులు అభినందించారన్నారు.

గృహనిర్మాణాలు ప్రారంభించండి

46వ డివిజన్ లబ్ధిదారులతో డీఈ బుజ్జిబాబు



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ బుజ్జిబాబు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 46వ డివిజన్‌లో నివేశనా స్థలాల లబ్ధిదారులు పక్కా గృహనిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని హౌసింగ్ డీఈ బి.బుజ్జిబాబు కోరారు. స్థానిక 46వ డివిజన్‌లో లబ్ధిదారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ డివిజన్‌లో మొత్తం 61 మందికి నివేశనా స్థలాలు మంజూరయ్యాయన్నారు. వీరికి కరగ్రహారంలోని ఎ–బ్లాక్‌లో స్థలాలు అప్పగించామని తెలిపారు. ఈ స్థలాల్లో లబ్ధిదారులు గృహనిర్మాణాలు ప్రారంభిస్తే మెటీరియల్, బిల్లులను సకాలంలో అందజేస్తామన్నారు. ఇప్పటికే మెరక పనులు పూర్తి కాగా విద్యుత్ సౌకర్యం కూడా వచ్చిందని పేర్కొన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకుడు ధనికొండ శ్రీనివాసరావు, టీపీవో కె.లావణ్య, వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్లు సత్తెనపల్లి శ్రీనివాసరావు, తుమ్మలచెరువు మురళీకృష్ణ, జూనపూడి సుధాకర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణకు అవకాశం



మాట్లాడుతున్న సత్యనారాయణ తదితరులు

పెడన: కృష్ణా జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక శివాంజనేయ స్టడీ సెంటరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 20వ తేదీన దివంగత మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కుట్టు శిక్షణ అనంతరం కంప్యూటర్ శిక్షణ కూడా ఉంటుందన్నారు. పెడన నియోజకవర్గం పూర్తవ్వగానే మరొక నియోజకవర్గంలో ప్రారంభించి అన్ని నియోజకవర్గాల్లో పూర్తి చేస్తామన్నారు. శిక్షణ పొందాలనుకునేవారు 9949732847, 7674080156 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో పెడన రిజిస్టర్ ఆఫీసు పక్కనే ఉన్న శివాంజనేయ స్టడీ సెంటరులో అయినా నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు కుర్షిద్‌బేగం, జిల్లా, పెడన నియోజకవర్గ, మండల నాయకులు బొర్రా కాశీవిశ్వేశ్వరరావు, గూడవల్లి కృష్ణార్జునరావు, వీరంకి శ్రీనివాసరావు, కాగిత సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇప్పించాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌలు సంఘం నేత వాకా, తదితరులు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం ఆన్‌లైన్ కాకపోవడం వల్ల డబ్బులు పడని ధాన్యం అమ్మిన రైతుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం అనుబంధ కౌలు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు తహసీల్దార్ రామానాయక్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఆన్‌లైన్ చేయక పోవడం వల్ల రెండు నెలల నుంచి 1150 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదన్నారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ చేయడానికి సైట్ ఓపెన్ కావడం లేదని ఈ సమస్యను పరిష్కరించి రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు మేడంకి వెంకటేశ్వరరావు, మురారి రాంబాబు, పువ్వల నాగేశ్వరరావు, చిర్ల పండుబాబు, కొడాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై శిక్షణ



పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్‌సాయి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఈనెల 14 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాలన్ని జయప్రదం చేయాలని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ హారిక అన్నారు. మండంలోని పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో ఆశ, ఆరోగ్య కేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణలో ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 17 పాఠశాలలు, 15 అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 1,190 మంది పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు మింగించాలని సూచించారు. మరొక వైద్యులు డాక్టర్ శ్రీరామ్ సాయి మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల వల్ల రక్తహీనత ఏర్పడుతుందని, దీని నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత నమిలి మింగాలని తెలిపారు. కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, హెల్త్‌సూపర్‌వైజర్ ఎన్ ప్రమీలరాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృత్తివెన్ను: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వైద్యులు సందీప్ తెలిపారు. దీనిపై కృత్తివెన్ను పీహెచ్‌సీలో సందీప్, చినపాండ్రాక పీహెచ్‌సీలో వైద్యురాలు లావణ్యలు ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బందితో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలను ఇవ్వనున్నామని మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తరువాత వీటిని చప్పరించాలన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు వీటిని సరఫరా చేసినట్లు వారు వివరించారు. దీనికి సంభందించిన పోస్టర్‌ను ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నకుమారి, ఎంపీడీవో పిచ్చిబాబు, వైద్యులు సోమవారం కృతివెన్ను ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనం



మాట్లాడుతున్న గరికపాటి

మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలోని చిట్టిపిళ్లారయ్యస్వామి దేవస్థానంలో శ్రీ శతచండీ సహిత శ్రీ మహారుద్ర యాగం అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావు చెప్పిన ప్రవచనాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. శ్రీ శంకరాచార్య రచించిన మూకపంచశతి అంశంపై చెప్పిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. మంగళ, బుధవారాల్లో కూడా గరికపాటి నరసింహారావు ప్రవచనాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ శంకరాచార్య రచనల్లోని పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వీరాంజనేయుని హుండీ ఆదాయం రూ.5.42లక్షలు

పామర్రు:ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.5,43,544 వచ్చినట్లు ఆలయ ఈవో ఎల్.సత్యవతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఆమె మాట్లాడుతూ గత 60 రోజులుగా భక్తులు కానుకలుగా హుండీలో వేసి వాటిని లెక్కిస్తున్నామని చెప్పారు. ఈ లెక్కింపును గుడివాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సమక్షంలో నిర్వహించారు.ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు,ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు పాల్గొన్నారు.